

# రాధికా స్వాంతనం

## పి.వి.ఆర్. శివకుమార్

"మన వివాహం జరిగే ముందుకొన్ని
ముఖ్య విషయాలు నీతో సంప్రదిం

చాలని నిన్ను ఇలా రమ్మన్నాను బావా!

"ముఖ్య విషయాలా? ఏమిటో అవి.... నిరభ్యంతరంగా చర్చిద్దాం." ఉత్సాహంగా అన్నాడు రామం.

"కొంచెం శ్రద్ధగా విను, ఇది మన జీవితాల్లో ఒకటర్నింగ్ పాయింట్ కనుక అన్నివిషయాలూ అన్ని కోణాల్లోనూ ఆలోచించి ఒక నిర్ణయానికి రావటం 'ఉభయులకూ మంచిది....' గట్టిగా శ్వాస పీల్చి మొదలెట్టింది. రాధిక:


"ఇంతకు ముందు మనం ఎన్నేళ్ళనించో బావా మరదళ్ళుగా.... చనువుగా మెలిగాం. నన్ను నువ్వూ, నిన్ను నేనూ కూడా బాగా అర్థం చేసుకున్నాం, అప్పట్లో!.... నువ్వు చదువుల కై యిల్లు వీడినప్పట్నుంచే మనం శారీరకంగా దూరమైపోయాం. మరి, అప్పుడే మనం మానసికంగా ఎదగనారంభించింది కూడా! ఈ నాలుగేళ్ళలో నువ్వూ, నేనూకూడా ఎంతో మారిపోయి వుండొచ్చు. ఉదాహరణకి....

అప్పట్లో మనం 'మొగుడూపెళ్ళాలాట' అని ఆడుకునే వాళ్ళం! మొగుడిగా, అందులో నీ పాత్ర ఏమిటో గుర్తు వుందను కొంటాను.... నన్ను కొట్టడం, ఏవేవో పనులుచెయ్యమని నిర్బంధించటం, ఆఫీసు వేళకి అన్నం వండమని ఆజ్ఞాపించటం! ఇక, భార్యగా నా పాత్ర. మొగుడివయిన నీ వేంచేసినా తలవంచడం, నీ సేవ చెయ్యటం, 'మొగుడే పెళ్ళానికి దేవుడు' అనుకోవటం! ఆ విధంగానే మసలు కోవటం!.... హుఁ.... ఎంత అసహ్యకరంగా వుండేవి ఆనాటి మన మానసిక పరిస్థితులు!.... ఛ ఛ .... అటువంటి ఆలోచనలు మనకి రావటానికి కారణం మన చుట్టూ వున్న వాతావరణమే కదా! అంత హేయమైన వాతావరణం మనచుట్టూ వుంది, నాడే కాదు.... నేడు కూడా!

కాని, సిగ్గువిడిచి చెప్తున్నందులకు మన్నించు, ఇది సిగ్గుపడవల్సిన విషయం కాదు.... మన పిల్లలు కూడా భార్యాభర్తలంటే మనం కలిగిన భావాలతోనే మెలగ కూడదు. అంటే ... మనం మారాలి! అందుకు తగినట్టుగా నేను మారటం జరిగిపోయింది కూడా. అలాటి ఆశయాలూ, ఉద్దేశ్యాలూ కల వాణ్ణే కట్టుకోవాలని నిర్ణయించుకోవటం కూడా జరిగింది. ఇక నేను నిర్ణయించుకోవల్సిందల్లా, నీ నిర్ణయాలూ, ఆలోచనలూ ఏ పథాన పయనిస్తున్నాయీ, అన్నదే! నాగుచించి నిన్ను మారమనటం ధర్మం కాదుకదా! కానీ యీనాడు చాలా మంది మగవాళ్ళలో వున్న దుర్గుణాలు నీలోలేవనే నే నిర్ధారించుకోవల్సివుంది...."

"రాధీ!.... నువ్వేం మాట్లాడుతున్నావో...."

"ప్లీజ్.... నా కడ్డురాకు. ఇలాగే మాట్లాడనీ! తప్పటడుగు వేసి, తర్వాత బాధపడే కంటే, ఇప్పుడే





అన్ని విషయాలూ తేల్చేసుకోవటం మంచిది.

మొన్న మొన్నటిదాకా, మా బామ్మ కబుర్లు వింటూ వుంటే, మొగుడు మనిషి కాదు కాబోలు, దేవుడు అనుకొనేదాన్ని! ఆడది మగాడి పరిచర్య చెయ్యటానికే పుట్టిందన్నట్లు ఆవిడ చెప్తుంటే మైమరచి వినేదాన్ని! నాకా అదృష్ట జీవితం ఎప్పుడు లభిస్తుందా, ఎప్పుడు పతివ్రత సేవలో ధన్యురాలి నౌదామా అని తపించి పోయేదాన్ని! కానీ ఇప్పుడవన్నీ తల్చుకుంటుంటే .... అవిణ్ణి నరికెయ్యాలన్న కసి ప్రబలుతోంది నాలో! ఛ ఛ! ఎంత దరిద్ర పుటాలోచనలు మన వెనుక తరాల వాళ్ళవి! ఆడది బానిస కాదనీ, శక్తి స్వరూపిణి అనీ, మగాడికి ఏ విధంగానూ తీసిపోదనీ, నిరూపించదలిచాను....

బావా! ఇందుకు నా భర్తగా నీ పూర్తి సహకారం కావాలి! అందించే హృదయ వైశాల్యం నీకుంటే నే మనం వివాహం చేసుకుందాం!"

"స్త్రీ జనాభ్యుదయ కాముకులలో నేనూ ఒకణ్ణి రాధీ!....నీకేం సహకారం కావాలో నిరభ్యంతరంగా చెప్పు!"

"ముఖ్యంగా నాకు, మొగుడంటే దేవుడనే నమ్మకం లేదు. మొగుడిమీద




ఆధారపడటం, స్వతంత్రం లేకుండా బ్రతకటం, జీవితమంతా చాకిరీలో గడపటం నా ఆశయాలకు విరుద్ధం.

నువ్వు నా కందించాల్సిన సహకారమల్లా, నన్ను సాటిమనిషిగా చూడటం, నా ఆశయాలకు ఆటంకం కాకుండా, నా వ్యక్తిత్వానికి భంగం కలిగించకుండా వుండటం మాత్రమే!

నేను టైపూ, షార్టుహేండూ ప్యాసయ్యానని నీకు తెలుసనుకుంటాను. వీటిని నా బి. ఏ. డిగ్రీకి జత కలిపితే, ఏదో ఒక ఉద్యోగం రాకపోదు. మన వివాహానంతరం, నాకు ఆర్థిక దుస్థితి కలుగకుండా, నేనూ ఉద్యోగం చేస్తాను.

ఇవన్నీ నీ కిష్టమయ్యే పక్షంలో, మన వివాహానికి నా తరుఫున ఎలాటి అభ్యంతరమూ లేదు."

"నీ వ్యక్తిత్వానికి భంగం కలిగించటం నా అభిప్రాయం కాదు. కానీ ....నీకు ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదనే నా అభిప్రాయం. నీ ఖర్చులకి కూడా చాలినంత డబ్బు నేనిస్తాను కదా!...."

"నాన్‌సెన్స్. అదే నేను సహించనిది! నీ ముందు చెయ్యిజాపే దౌర్భాగ్యానికి నేనెందుకు దిగజారాలి? స్వతంత్రంగా వుద్యోగం చేసుకొంటుంటేనే ఆర్థిక స్వాతంత్రం నిలబడేది!"

"సరే! నీ, మిగిలిన అభిప్రాయాలన్నిటినీ గౌరవిస్తున్నాను. ఉద్యోగం విషయం నీ యిష్టం. కానీ.

నీ కష్టంలేని నాడు మాత్రం నిరభ్యంతరంగా మానివేయవచ్చు."

"థేంక్స్. కానీ ఆ రోజు మాత్రం రావనే నా ప్రబల విశ్వాసం."

● ● ●

పెద్దల దీవెనలతో రాధిక వివాహం, రామంతోనే జరిగిపోయింది. అన్ని విధాలా తన ఆశయాలకు, అనుకూలుడైన భర్త, తన బావే కావటం, తన అదృష్టమని మురిసిపోయింది రాధిక. వివాహం కాగానే, రామం వుద్యోగం చేసే వూర్లోనే, ఆమెకూ ఏదో ఆఫీసులో ఉద్యోగం దొరికింది అదీ తన అదృష్టంగా మురిసిపోయిందామె. రోజులు సాఫీగా దొర్లిపోసాగాయి.

● ● ●

ఎంతకీ బస్ రాకపోయే సరికి విసుగు హెచ్చింది రాధికకు! పైగా చుట్టూ వున్న వారి కళ్ళన్నీ ఆమె మీదే!

చికాగ్గా వాచీ చూసుకుంది రాధిక. ఆరు కావస్తోంది! "ఛ ఛ. వెధవ దీ, ఇప్పుడెళ్ళి వంట మొదలెట్టాలి కాబోలు!" "మనసులోనే విసుక్కుంది. ఇంతలో అల్లంత దూరాన కనబడ్డ బస్సు ఆమెను వూరట పర్చింది. బస్సు వస్తూనే, మగాళ్ళంతా, ద్వారం చుట్టూ మూగారు. దిగేవాళ్ళని దిగనీయకుండా! ఆడవాళ్ళంతా వీరి వెనకే మిగిలిపోయారు, తోసుకుంటూ, కుమ్ముకుంటూ సగం మంది మగవాళ్ళు ఎక్కేసరికే బస్ కదిలిపోయింది!

"ఛ ఛ.... పాడు మగాళ్ళు! ఇలా వీళ్ళు తోసుకుంటూ ఎక్కుతుంటే ఇక ఆడవాళ్ళెలా ఎక్కటం? చికాకు అతిశయించగా అనుకుంది ఆమె.

ఇల్లు చేరే సరికి ఏడు దాటింది. విసుగ్గా వున్న మనసు, స్నానం

---

● కొత్తకొత్త విషయాలను పరిశోధించిన మహానుభావులను గురించి చెబుతూ టీచరమ్మ, ఇందిరాదేవి నుద్దేశించి "అమ్మా! ఇందిరా! నువ్వు చెప్పు తల్లీ! నువ్వు పెద్దయితే ఏం కనిపెడతావు?"

ఇందిర నెమ్మదిగా, ఒక యంత్రం కనిపెడతాను. స్విచ్ నొక్కితే పాఠాలన్నీ చదవకుండానే వొచ్చే యంత్రం-"అన్నది.

టీచరమ్మ: చిరాకుగా 'నువ్వు చాలా సోమరివి.' అని రాము వంక తిరిగి "ఇప్పుడు రాము తాను పెద్దయ్యాక ఏం కనిపెడతాడో చెబుతాడు. విందాం" అన్నది. రాములేచి జుట్టుసర్దుకుని "అటువంటి యంత్రానికి స్విచ్ కూడా మనం నొక్కకుండా పడన్నా ఏర్పాటు కనిపెడతాను-'' అన్నాడు.

చేయగానే అలిసి పోయింది. 'ఇక వంట మొదలెట్టాలి!' అనుకోగానే ప్రాణం పోయినట్లనిపించింది రాధికకి.

"ఏం రాధా, యీపూట హోటలే శరణ్యమా ఏమిటి? ఇంతాలస్యమయిందేం!" హాస్యంగా అన్నట్లు అన్నా, రామం గొంతులో చిరాకు ధ్వనించనే ధ్వనించింది. కోపంవచ్చింది రాధికకి. "మీకేం మగమహారాజులు! కూచునేన్నయినా కబుర్లు చెప్తారు. మా కాపాడుబస్సులో సీటుదొరికేసరికే తల ప్రాణం తోకకొస్తుంది! వెధవది, మీ మగాళ్ళకసలు బుద్ధివుంటేగా! ఒకటే తోపిడీ. ఒకటే తొక్కిసలాటాను! మమ్మల్ని ఎక్కనిస్తేనా?"

"ఎవరో ఎక్కనిచ్చేదేమిటి? సర్వసమానులు, మీరే తోసుకు ఎక్కాలి. సుకుమారుల్లా దూరంగా నిలబడితేదారి ఎవరిస్తారు? ఎవరితొందర వాళ్ళది. అయినా, నీ ప్రత్యేకత ఏమిటి? నీకెందుకివ్వాలివారి?

"సర్లెండి! మీరు చెప్పటం బానే వుంది! మగాళ్ళని తోసుకుంటూ ఎక్కమంటారా?"

"అవును ఏం? మగ, ఆడ తేడా లేదుగా! అంతా సమానమేగా! తోసుకు ఎక్కితే ఏం?"

"చాల్లెండింక! అర్ధం పర్ధం లేకుండా!" చికాగ్గా అనేసి, లోపలికెళ్ళిపోయింది రాధిక.

"రాధీ! ఎందుకొచ్చిన తిప్పలు యివన్నీ? శుభ్రంగా ఆ వుద్యోగం మానెయ్యరాదూ?"

తొమ్మిదిగంటలకి భోంచేస్తూ అన్నాడు రామం. ఉస్సుమంది రాధిక.

"ఇంకానయం. ఛస్తే అలా జరగదు. అసల్నేనొకటాలోచిస్తున్నా. ఇలా నేనే ఆఫీసునించివచ్చి, వంట చేసేబదులు, ఏ వంట మనిషినో పెట్టుకొంటే పోలా?"

"వంట మనిషిని పెట్టుకుని, దానికి




నెలనెలా డబ్బిస్తూ....యీ తిప్పలన్నీ పడి, నువ్వు బాపుకునేదేముందీ, అని!"

"బాపుకున్నా, బావుకోక పోయినా, నేను మాత్రం వుద్యోగం మానేదిలేదు! వీలయితే వెంటనే వో వంటమనిషిని చూడండి, లేదా, నేనే ప్రయత్నిస్తాను."

మర్నాడే రామం ఒక వంటమనిషిని తీసుకువచ్చాడు. రాధిక, వంటిల్లంతా ఆవిడకి పరిచయంచేసి, చేతులు కడుక్కుంది తృప్తిగా.

● ● ●

"ఛీఛీ....ఇవి అన్నమా, బొగ్గులా? ఈ కూరలోకి ఉప్పు అనవసరం అనుకున్నారా? చారు కాచమంటే, నీళ్ళు కాచారు, ఎలా తినాలి అన్నం?........ ఇదేం వంట? ఇలా అయితేఎలా?" మొదటిపూటే మండిపడింది రాధిక. వంట చూస్తూనే.

"ఏమో తల్లీ, అవన్నీ నాకు తెలియదు. ఇంతవరకూ ఎన్నో యిళ్ళలో పనిచేశాను గాని ఎవరూ పల్లెత్తుమాట అనలేదు...." ఇంత వరకూ తను ఎన్నియిళ్ళల్లో వంటలు చేసిందీ, ఎన్ని తద్దినాలూ, పెళ్ళిళ్ళూ తన చేతుల మీదుగా వెళ్ళిందీ, తన క్వాలిఫికేషన్లన్నీ లిస్టులా చదివింది సర్టిఫికెట్లలాగా వంటావిడ! మాట్లాడకుండాలేచిపోయింది రాధిక!

నాలుగు రోజులు పోయేసరికి నాలిక పీక్కుపోయింది రాధికకి ఆవిడ వండుతున్నది తినలేక. "విధా, ఖర్మమా" అన్నట్లు సహిస్తున్నరాధికకి, ఆపూట వంటావిడ చర్య చూసేసరికి మతి పోయినట్లయింది.

బాదం ఆకులోంచి. పచ్చడితీసి చేత్తో వడ్డిస్తున్న వంటావిడని చూసేసరికి అసహ్యంతో మరిపోయిందామెకి.

"ఇదేమిటండీ? ఇంట్లో ఇన్నిస్టీలు గిన్నెలున్నాయి. ప్లేట్లున్నాయి, ఈ ఆకులో పచ్చడేమిటి? పైగా ఆ చేల్తో వెయ్యటమేమిటి, స్పూన్లు ఏమయిపోయాయి!" కంగారుగా అరిచింది. మూతి ముప్పైఆరువంకర్లు తిప్పిందివంటావిడ.

"ఏమవుతాయమ్మా? వున్నవివెధవనాలుగిన్నెలేగా. రాత్రి ఒకగిన్నె కుక్క ఎత్తుకుపోయింది వెధవకుక్క ఇంట్లో ఎందుకలవాటు చేశావ్?"

"ఛ....ఛ....నేనలవాటు చేశానా? నాకేంతెలుసు?"

'ఏమోనమ్మా నాకూ తెలియదు. రాత్రివస్తే, అలాగేచేమో అనుకున్నాను ఇక చెమ్చాలసంగతే అడుగుతావూ? దున్నపోతులల్లే ఎలుకల్ని పెంచితే ఎన్నిఅగుతాయి? పాడు ఎలుకలు, ప్రాణాలు తీస్తున్నాయ్."

మరి మాట్లాడలేక, విసుగు, వెగటుతోలేచిపోయింది రాధిక.

ఆరాత్రి చూస్తే, వెండిగ్లాసులు

రెండు కనబడలేదు రాధికకి. ఉదయమే వంటావిడని కదిలించింది.

"ఏమండీ, వెండిగ్లాసులు రెండూ కనబడటంలేదే?"

"ఏవమ్మోయ్! అంత తెలికమనిషి ననుకున్నావా? మర్యాదగా మాట్లాడు, ఏమనుకొంటున్నావో? ఎక్కడినడుగుతావు నీవెండిగ్లాసులూ, స్టీలుగిన్నెలూనూ? నన్ను వంటకి పెట్టుకున్నావా- నీ యింటికి కాపలాకి పెట్టుకున్నావా? టింగురంగా మని భార్యాభర్తలిద్దరూ ఉద్యోగానికి పోతుంటే యింట్లో కాపలా కాస్తూ కూచుంటాననుకున్నావా? అసలు నీవంటా వద్దు, పాడూవద్దు! పారేయ్ నాకు రావల్సిన డబ్బు. నేపోతా."

ఊరేగిపోయేటట్లు కేకవేసింది వంటమనిషి. చచ్చిపోయింది రాధిక. వెంటనే డబ్బుతీసుకొని బయటకు నడిచింది వంటమనిషి.

"ఇంకా సాత్రోజులుంటే ఎన్ని గిన్నెలు పోయేవో"ననుకొంటూ పనిలోకి దిగింది రాధిక.

'మరొకళ్ళ నెవర్నన్నా చూడమన్నావా?" అనడిగాడు రామం.

"వొద్దు బాబోయ్! నే పడలేను వీళ్ళతో. కంగారుగా అంది రాధిక.

● ● ●

'ఇంత కేర్లెస్'గా వుంటే చాలా కష్టం రాధికగారూ! ఏమిటీ ఫైల్! ఎన్నితప్పులో చూడండి. మరీ మన సంసారం యింటిమీదుంచుకు పనిచేస్తే కుదరదండీ. అందుకే అసలు లేడీస్ ఉద్యోగాలు చెయ్యటం అంత మంచిది కాదు! మీకెందుకు చెప్పండి యీ ఉద్యోగం," గయ్యిమన్న ఆఫీసర్‌కి తోడుగా,

"మనసంతా యింటిమీదే వుంటుందండీ. లేడీసంతాయింతే, వంటయింటిమీదుంటాయి ఆలోచనలన్నీ"

అన్న ఆఫీసర్‌గారి మిత్రోత్తముణ్ణి, అతడి వెకిలి నవ్వుని చూసేసరికి, వొంటిమీద తేళ్లు జెర్రులూ పాకినట్లయింది రాధికకి.

"స.. సారీ సార్. ఇక నుంచీ

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడెన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL-327/1

జాగ్రత్తగా చూస్తాను" సిగ్గూకోపమూ ముంచుకువచ్చిన కంఠంతో అంది నెమ్మదిగా.

"నోనోనోనో, నథింగ్ ఎలౌడ్. ఇలాటిమాటలతో పనిలేదు. పనిజరగాలి." విసిరికొట్టాడు ఫైల్ ఆఫీసరు. దుఃఖం పొడుచుకురాగా ఫైల్ తీసుకుని బయటకు వచ్చింది రాధిక.

"పైగా ఈ ఆడవాళ్ళతో యిదో హాటి! నెత్తిమీదే వుంటుంది నీళ్ళ చెరువు" అన్న మాటలు వెనుకనుండి వచ్చి వెన్నుచరిచాయి. చరచర వచ్చి సీట్లో కూలబడింది.

"దరిద్రపుటాఫీసులో తనేనాడయినా తప్పు చేసిందీ? ఒక్కరోజులో యిన్ని తిట్లా, అత్తమీది కోపం దుత్తమీదా? మగాళ్ళెవరూ తప్పు చెయ్యరా? మాటిమాటికీ "లేడీస్" అంటు ఆ దెప్పిపొడుపు లేమిటి? ఛ....చ.... నోటికొచ్చినట్లు వాగుతున్నాడు .... పాడు వుద్యోగం! ఉక్రోషంగా అనుకుంది రాధిక.

* * *

ఆ రాత్రి భర్తతో అంతా చెప్పింది రాధిక,

"మొహంమీద కొడదామనిపించిందనుకోండి. ముచ్చు మొహమూ, వాడూను, నోటికొచ్చినట్లల్లా కూస్తాడా! పైగా, పక్కనే వాళ్ళ స్నేహితుడొకడు...."

"సర్లే, వాడికి అధికారముంది, అన్నాడు. అయినా, సంపాదించే, సంసారాన్ని పోషించే, భర్త ఏమన్నా అంటే పడరుగానీ, ఆఫీసులో యజమాని అంటే పడకేంచేస్తారు? తప్పుతుందామరి!" దెప్పిపొడిచాడు రామం.

మొదాటిసారిగా 'నిజమే!' అనిపించింది రాధికకి_

* * *

సాయంత్రం ఏడుగంటలుదాటింది. చీకట్లు చిక్కగా ముసురుకున్నాయి. పైగాశీతాకాలం కూడాను.

విసుగ్గా చుట్టూచూచింది, రాధిక. యింకా బస్ రావటంలేదు. జనం తీర్థప్రజలా వున్నారు! మూడు బస్సులు వెళ్ళినా జనంతరగటంలేదు. "వెధవది. ఇన్స్పెక్షన్ గురించి ఓగంట లేటుగా బయటపడేసరికి ఆరుదాటింది. ఇక్కడ యిదీవరస!" 'వాచీ' చూసుకున్న ఆమెగుండెలు గుబగుబలాడేయి, టైము ఏడున్నర! తనముందు, చేంతాడంత 'క్యూ'. ఇంకా నాలుగు బస్సులొచ్చినా ఆమెకిసీటు దొరికేలా అనిపించలేదు!

"ఇక లాభంలేదు. ఏరిక్షాలోనో పోదాంపద లలితా!" తోటియువతితో అంది విసుగ్గా. ఇద్దరూకలిసి పక్కకు వచ్చారు. రిక్షాబేరమాడవోతే, వాళ్ళు కొండెక్కి కూర్చున్నారు! "అంత ఛార్జియిచ్చి వెళ్ళకపోతేనేం? నడిచే పోదాంపద! ఎంతలో వెళ్ళగలం!" అంది ఆమెస్నేహితురాలు. ఇద్దరూ నడకసాగించారు.

"ఇంకా ఒక మైలు నడావాలి" అంది లలిత విసుగ్గా! "ఎంతదూరమయినా ఫర్వాలేదు, కానీ, ఇక్కడినుంచీ లైటు సంభాలే్లేవుకదా! దరిద్రపు మునిసిపాలిటీ! పన్నులు దిగమింగుతారుగానీ, పనులు చెయ్యరు, అంది రాధిక.

ఇద్దరూ పడివడిగా నడక సాగించారు. ఎవరో వెనకే వస్తున్న ట్లే వెనక్కి తిరిగి చూచింది రాధిక. ఎవరో వ్యక్తి తూలుతూ వస్తున్నాడు. గుండె గుభేలుమంది ఆమెకి. 'లలితా! ఎవరేవాడు? చూడవే'అందినెమ్మదిగా, ఆమెకూడా చూసేసరికి అతడు బాగా దగ్గరగా వచ్చేశాడు. "అమ్మో' అంది లలిత. ఇద్దరూ నడక వేగం మరింత పెంచారు. కానీ, అంతలోనే అతడు మీదకువచ్చేసి, రాధిక భుజంపైచెయ్యి వేశాడు!

"విడు. వెధవా .... అమ్మో." గట్టిగా అరిచింది రాధిక. లలిత దూరంగా పరిగెట్టి వాళ్ళనీ, వీళ్ళనీ పిలిచింది. నలుగురూ చేరేసరికి, ఆవ్యక్తి, పారిపోబోయాడు.నలుగురూ చేరి వాణ్ణి తన్నారు, "ఇలాటిదారిలో వంటరిగా రావటం దేనికి? ఇలాటి రభసలు జరుగుతాయని తెలియదూ? అంటూ వాళ్ళు అందరూ, వీళ్ళిద్దరినీ కూడా తలోటీ అన్నారు. సిగ్గుతో చచ్చినంత పనిఅయింది వాళ్ళకి.

• • •

అంతావిని కంగారుగా అన్నాడు రామం:

"ఇంకానయం. వాళ్ళవరో రాబట్టి సరిపోయింది. లేకుంటే ఏమయ్యేది? అయినా రిక్షాలో రాక, యీ వెధవ ఆదాఏమిటి?''

"సరేలెండి! ఏంచెయ్యమంటారు మరి! అనవసరపు ఖర్చుదేనికిలే' అని అనుకున్నాను. ఇదంతా నేనే కలగన్నానా?"

"అసలెందుకొచ్చిందీ అవస్థ?" చికాగ్గా అన్నాడు రామం: "ఏమిటినీకొచ్చిన స్వాతంత్ర్యం? నువ్వొక్కదానివే వాడి బారినుంచి రక్షించుకోగలిగావా? పోనీ, మీ స్నేహితురాలయినా రక్షించిందా? ఏం? తోటి ఆడది అపాయంలో వుంటే ఆదుకోలేకపోయిందేం? దానికి మళ్ళీ మా మగవాళ్ళు కావల్సివచ్చారే?

మొగుడు తిడితే పడటానికి అభిమానంకానీ, ఆఫీసర్ చేత చివాట్లు తినవచ్చు: మొగుడు పోషిస్తే అభిమానం కానీ, మరో నలుగురు కలిసి రక్షిస్తే అవమానంకాదు! ఎందుకు రాధా ఇంతపట్టుదల నీకు? ఏమిటి నీ అర్థంలేని ఆదర్శాలు? ఏం జరిగింది యీ వుద్యోగంవల్ల నీకు?''

తన ఉద్యోగంపై విసుర్లు రేగటంతో కోపంవచ్చింది రాధికకు:

"ఎందుకు మాటిమాటికీ నా ఉద్యోగంపై విరుచుకుపడతారు? అసలు నా ఉద్యోగమంటేనే పడటంలేదు మీకు. అవునులెండి, కబుర్లయితే చెప్పొచ్చుగానీ, పెళ్ళాం తనకు




'చాకిరీ' చెయ్యడంమాని, తనతో సమంగా ఉద్యోగంచేసి సంపాదించు కుంటుంటే భరించటం మాటలా?''

"అధికప్రసంగం చెయ్యకురాధా! హుఁ.... "చాకిరీ'' వంట చెయ్యటం, భర్తకింత పెట్టటం చాకిరీనా? మరి ఉద్యోగం చెయ్యటం. భార్యాబిడ్డలని పోషించటం చాకిరీకాదా? యీ చాకిరీ తేలికా, ఆ చాకిరీ తేలికా? అయినా, అంతా సంపాదించేవాళ్ళే అయితే వండేవాళ్లు, యింటిని దిద్దుకునేవాళ్ళూ ఎవరు? అయినా, ఒక కుటుంబంలో నలుగురూ నాలుగు పనులు చేసుకోవాలిగానీ అన్నీఒకరే చేయడం సమంజసమా?

చూడురాధా! నామాట నెమ్మదిగా విని, అర్థంచేసుకోవటానికి ప్రయత్నించు.

ఒక సంసారం నడవాలంటే భార్యో, భర్తో ఎవరో ఒకరు తేవాలి. ఒకరు వండాలి. తేవటం తేలికా? వండిపెట్టడం తెలికా? నువ్వేచెప్పు, ఆరెండు చేస్తున్నావుగానువ్వు.

పురుషుడు మానసికంగా, దైహికంగాకూడా స్త్రీ కంటె బలవంతుడు. ఇంట్లోకూర్చుని తెచ్చినదాన్ని వండిపెట్టటం కంటే, బయటకువెళ్ళి ఏదో విధంగా సంపాదించుకురావటం కష్టం కదా! కష్టమయినపనిని బలవంతుడు చేయటం అవసరమూ, సమంజసమూ

కదా! ఆఫీసులో ఫైల్సుతోనూ, దారిలో బస్సు కోసం "క్యూ''లోనూ కుస్తీ పట్టటం ఎంత కష్టమో నీకూ అనుభవైకవేద్యమే! ఇక అబల వయిన నువ్వు మన సంసారం నడవటానికి సంపాదించి తేవటం సమంజసమా, లేక ఉద్యోగం మాని, హాయిగా యింట్లో వండి పెట్టి, యిల్లు దిద్దుకుంటూ గడపటం క్షేమమా? ఇక, సంపాదించే మొగుడిది "చాకిరీ"యో, వండిపెట్టే భార్యది 'చాకిరీ' యో నువ్వే తేల్చుకో!

నేనే తెచ్చి, నేనే వండిపెడితే, నువ్వు తింటూ కూర్చుండటం న్యాయ విరుద్ధం! మనసంసారంపై నువ్వన్నట్లు యిద్దరమూ సమానహక్కులే కాదు, సమాన బాధ్యతలుకూడా కలిగి వున్నాం! అలాటప్పుడు నేను సంపాదించి తేవటం, నీవు వండి పెట్టటం నేరమూ కాదు, అన్యాయమూ కాదు, చాకిరీ అంతకంటేకాదు.

ఇలాటి అర్థంపర్థంలేని ఆవేశంతో, అనర్థాలపేరుతో మిమ్మల్ని మీరే అర్థంచేసుకోలేక, మమ్మల్ని అపార్థం చేసుకుంటూ ప్రవర్తిస్తుంటే మీ స్త్రీజాతి ఎప్పుడు ముందుకు వస్తుంది?'

ఆవేశంగా అన్నాడు రామం.

అతడిమాటల్లోని నిజానిజాలు ఆలోచిస్తూ మౌనంగా లేచిపోయింది రాధిక.

• • •

"ఇది చూశారా?...." పేపర్ చేత పట్టుకువస్తూ అంది రాధిక.

"ఏమిటిది?"

"యీ పెళ్ళి ఫొటో!.... యాభయ్యేళ్ళముసలాడికి. పద్దెనిమిదేళ్ళ పడుచుతో పెళ్ళి!...."

"ఓహో" తేలిగ్గా కొట్టిపారేసినట్టు అని, తన పనిలో మునిగిపోబోయాడు రామం. కుతకుత ఉడికిపోయింది రాధిక.

"ఊహుం.... అంత తేలిగ్గా వుందా మీకీవిషయం! మరో ఏడెనిమిదేళ్ళలో యీ పేపర్లోనే చూస్తాం యీముసలాడి చావుని! ఏమిటప్పుడా యువతికిదారి? ఏమిటీ అన్యాయం? కాటికికాళ్ళుచాపుకు కూర్చున్న యీ ముసలాడికి పడుచుతో పెళ్ళి కావలసివచ్చిందా? మీమగాళ్ళందరికీ వున్నరోగం కాదూయిది? ఏమిటీ ఆడాళ్ళతక్కువ? యాభయ్యేళ్ళ ఆడదాన్ని రెండో పెళ్ళిచేసుకునే మగాడెవడన్నా వున్నాడా? రేపా ముసలి పీనుగు చావగానే ముప్ఫయ్యేళ్ళదీ ముండమోసి- కూర్చోవాలి. ఛీ... ఛీ మీ మగాళ్ళనేమనాలి?"

"రాధికా.... ఏమిటీధోరణి? మగాళ్ళు మగాళ్ళంటూ జాతి భేదాలు సృష్టించి మాట్లాడతావే? పోనీ, ఆ యువతిని చేసుకోమను రెండో పెళ్ళి! చట్టసమ్మతమేగా!" హాస్యంగా అన్నాడు రామం.

మండిపోతూ అంది రాధిక: "చాల్లెండి రెండో పెళ్ళి స్త్రీలని చేసుకోనేసాహసం

కూడా ఏడ్చింది మీ మగాళ్ళలో!....అది లేకనేగా యీ తిప్పలన్నీ! అసలుమీకు బుద్ధిలేదు. లేకుంటే ఏమిటిది?

మగవాడు వందమంది ముండలతో కులుకుతుంటే, ఆడది గుండు చేసుకొని మూల కూర్చోవాలా? ఇది న్యాయమా? ఏం తక్కువతిందని మా స్త్రీజాతి మీ అన్యాయాలకి తలొగ్గాలి? ఆదినుండీ ఆడదాన్ని యీస్థితికియీడ్చిన మీమగాళ్ళనేం చేస్తే పాపముంది?...."

"అర్థంలేని ఆవేశంతో మాట్లాడకురాధా...." మధ్యలో అడ్డుకొంటూ అన్నాడు రామం: "ఆ యువతికి పెళ్ళవుతోందీ అంటే అందుకు సవాలక్ష కారణాలు సాలెగూడులా అల్లుకువుంటాయి. ఆ వివాహానికి ముఖ్యంగా దోహదంచేసేదీ మీ ఆడవాళ్ళే! ఆ పిల్ల అసలీపెళ్ళికెందుకొప్పుకోవాలి? ఎదురుతిరిగితే ఏంచెయ్యగలరు ఎవరు మాత్రం? ఎదురుతిరగలేని అజ్ఞానం, దుస్థితి, ఆమెకెందుకు కలిగుంటాయో వూహించుకోలేవా? నిరక్షరాస్యతవల్లనే అయుండాలి. ఆ పిల్లే చదువుకున్నదయితే, యిలాటిపెళ్లి నిర్ణయింపబడగానే, ఎవడితోనో లేచిపోతుంది!

ఆడవాళ్ళు యధేచ్ఛగా చదువుకోవటానికి అన్ని సదుపాయాలూవున్న యీ రోజుల్లోకూడా "స్త్రీవిద్య" కుంటుపడటానికి కారకులెవరు? "ఇరుగమ్మలూ- పొరుగమ్మలూ" అయిన మీ ఆడవాళ్ళుకారూ? మూల, తిని కూర్చోలేక, యువతరంవారి ఆశయాలకు అడ్డొస్తున్న ముసలమ్మలుకారూ, వీళ్ళంతా "స్త్రీలు" కారా? ఆడవాళ్ళందరూ కలిసి అభ్యుదయం సాధించగలరుగానీ, ఇలా తలోవైపుకూ లాగితే సమస్యలెలా తీరతాయ్?

ఇక, మగాడు "ముండల్తో" కులుకుతుంటే, ఆడది గుండుచేసుకు మూలకూర్చుంటోందని మాట్లాడావు. పిచ్చిదాన! మగాడు రెండుపెళ్ళిళ్ళు చేసుకోవటం చట్టరీత్యా నేరంకాదూ? వందమంది ముండల్తో కులుకుతున్నాడన్నావ్, మరి ఆ వందమందీ ఎవరు? స్త్రీలుకారా? అలాటిమగాడు కులికినా, తన సర్వస్వం దోచిపెడుతున్నాడు. కానీ, ఆ వ్యభిచారిణులో? అతణ్ణి దోచుకోవటమేకాక, అతడి సంసారాన్ని....తన తోటిస్త్రీల కాపురాల్ని కూల ద్రోస్తున్నారు. మరి వాళ్ళు వందమంది మగవాళ్ళతో కులకటమే కాదు, వేలమంది స్త్రీలను కాల్లగొడుతున్నారే! ఆ "వేశ్యా రత్నాలు" మీ "స్త్రీజాతిలో చేరరా? వాళ్ళగురించి మాట్లాడవేం?

చట్టబద్ధంకాని విషయాలపై మాట్లాడటంలో అర్థంలేదు రాధా!....

ఏమీ మాట్లాడకుండా వింటోంది రాధిక. క్షణం వూపిరి పీల్చి శాంతంగా తిరిగి ప్రారంభించాడు రామం:

"నువ్వన్నదాంట్లో నిజముంది. రైటే. ఈ ముసలాడి భార్యగా మారటం ఆ యువతి దురదృష్టమే. ఈ అన్యాయాన్ని అరికట్టవల్సిన

భాద్యత మనందరిమీదావుంది. కానీ, యిలాటి వివాహాలకి ముఖ్యమయిన కారణాల్లో ఒకటి "వరకట్నం? ఈ దురాచారం నశించాలంటే యువకుల్లో విజ్ఞానం పెంపొందాలి, నిజమే. కానీ, మానవుడు ఆశాజీవికదా- వెదకబోయినతీగె కాలికి తగిలినట్లు, ఎదురౌతున్న వేల రూపాయల్ని "ఆదర్శాలకు బలి యివ్వటం" యీనాడు సామాన్య మానవుడు చేయగలిగిన పనేనా? ఇక కబుర్లలో తప్ప. వాస్తవంలో ఆచరణీయం కానేరదు. కనుక, ఈ దురాచారానికి బలియౌతున్న మీ యువతీమణులే దీనికి స్వస్తివాక్యం పలకాలి. పలకగలిగినవాళ్ళు కూడా మీరే- మీరంతా కంకణం కట్టి, "కట్నం పుచ్చుకొనేవాడు" మాకొద్దని కంకణం కడితే, మగవారేం చేయగలరు? నువ్వే చెప్పు. మీలో చీలికలే లేకుండా అంతా ఒక త్రాటి కింద నడిస్తే, యీ లక్ష్యాన్ని సాధించటం అంత కష్టమా "ఆడదిలేని జీవితం" వెన్నెల లేని రాత్రి వంటిది కాదా మగవాడికి? వివాహం చేసుకోనిదే ఆగలేని మగవాడు తప్పక కట్నాల్ని విసర్జిస్తాడు. రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లు కదా- యిచ్చేవాళ్ళు యివ్వటం మానివేస్తే, పుచ్చుకొనేవాళ్ళు ఎలా తీసుకుంటారు? ఆడపిల్లల్ని కన్నవారెలాగూ యిలాటి ప్రతిజ్ఞలు పూనలేరు- తమ బిడ్డల సుఖాన్ని యీ పద్యమానికి బలి చేయలేక.....కానీ, ఆ బిడ్డలే యిందుకు ముందుకువస్తే, ఆపగలిగేవారెవరు?

కాబట్టి ఈ ముసలాడి పెళ్ళికి పురుషులకి తప్పేనని నే ఒప్పుకొంటాను, కాని స్త్రీలదిమాత్రం భాద్యత లేదని నువ్వు చెప్పగలవా?....


ఏం రాధీ. మాట్లాడవేం? నా అభిప్రాయాలు నీకు నచ్చలేదా?" సూటిగా చూస్తూ అడిగాడు రామం.

విశాల నేత్రాలతో చూస్తూండి పోయిన రాధిక బొమ్మ కదిలినట్లు కదిలింది:

"నిజమేనండి. ఇంత విమర్శనాత్మక దృష్టితో ఆలోచించలేదు నేను. మీరన్నమాట నిజమే."

"అవకాశం. అవసరం వచ్చాయి కాబట్టి చెబుతున్నాను. ఈ వొక్క విషయమే కాదు, ఇంకా చాలా విషయాల్లో [illegible]. నువ్వేమిటి మీ ఆడాళ్ళంతా....మమ్మల్ని అపార్థం చేసుకుంటున్నారు. అందువల్లే ఎన్నో వాదాలు, పంతాలు రేగాయి. ఉదాహరణకి.

ఆర్థిక స్వాతంత్ర్యమని వాపోతూ వుద్యోగంలో చేరావు నువ్వు. ఏం వొరిగింది దానివల్ల నీకు? నీ జీతం రాళ్ళు లేకపోవటంవల్ల మన సంసారానికేమైనా లోటా? యింటపని, ఆఫీసుపని రెంటిలోనూ సతమతమైపోతూ, చిక్కి సగమై, స్త్రీ సహజమైన సౌకుమార్యాన్ని సైతం




కోల్పోతూ, ఈ వుద్యోగం చెయ్యమంటే చెప్పలేనంత కోపం నీకు. ఒక్కసారి అద్దంలో చూసుకో నీ స్వరూపాన్ని!

ఇవన్నీ కాకపోయినా, ఏదో ఆదర్శం కోసం యీ వుద్యోగంలో చేరావు నువ్వు. కాని, ఎన్నో అవసరాలతో కుటుంబ పోషణార్థం వుద్యోగానికై వెదకుతూ, నిరుద్యోగిగా అలమటించే ఒక సాటి మానవుని కడుపు కొట్టి, నీ శుష్క ఆదర్శాలని తీర్చుకొంటున్న విషయం గుర్తించటం లేదు. కాదంటావా? నీ ఆదర్శాలకి బలియై, భార్యా బిడ్డలకు తిండి పెట్టలేక, రోడ్లమ్మట తిరుగుతున్న ఆ మానవుని ఉసురూ, ఆ కుటుంబపు కడుపుమంటా నీకు తగలవా! వాటి వేడిలో నీ వాడి ఆదర్శాలు ఏనాటికయినా కరగకపోవు! ఆ అన్యాయం నీకిష్టమయ్యే చేస్తున్నావా? ఇది న్యాయమా?

ఉద్యోగం చెయ్యనంత మాత్రాన నీ వ్యక్తిత్వానికేమీ భంగం రాదు రాదా?.... కానీ ఇలా సాటివాని కూడు గొట్టటంవల్ల నీ మానవత్వమే పతనమై పోతుందన్న విషయం తెల్సుకో.

ఇక, వంట చెయ్యటం వల్ల భర్తకి సేవచేసే పాదదాసిగా నిన్ను నువ్వు వూహించుకోనక్కర్లేదు. భర్తకి పిల్లలకి వండి పెట్టినంత మాత్రాన నీ వ్యక్తిత్వమూ, అహమూ దెబ్బ తినేట్లయితే రేయింబగళ్ళు గొడ్డు చాకిరీ చేసి సంసారాన్ని నడిపే నా కసలు వ్యక్తిత్వముంటుందా? నేను "నౌకరు"గానే పరిగణింపబడనక్కర్లేదా?

మరొక వాదం కూడా యీనాడు

అభ్యుదయాన్ని ఆశిస్తున్నామనే స్త్రీలో కంలో చెలరేగింది. అది సీదాకా రాక పోవటం ఆశ్చర్యం! భర్త భార్యని నువ్వు అంటున్నాడు గనుక, భార్య భర్తని కూడా 'నువ్వు' అనే సంబో దించాలని! ఇందులో ఎవరికీ ఏ నష్టమూ లేదు! నువ్వు నన్ను ఏకవచనంతో సంబోదించావా, బహు వచనంతో సంబోదించావా అన్నది కాదు ముఖ్యం! నీ దృష్టిలో నా నాకెంత విలువ వున్నదీ, నువ్వు నన్నెంత గౌరవిస్తున్నావూ, ఆదరిస్తు న్నావూ అన్నది! నువ్వు నన్నెలా పిలిచినా నాకిష్టమేగానీ, 'మీరు' అనటం వల్ల నీ కొచ్చే పరువు భంగమూ, నష్టమూ ఏమిటో చెప్పగలవా? సోసీ. నిన్ను కూడా బహువచనంలో పున్నించమంటే, నేను సిద్ధమే...."

"చాల్లే ఆపండి! .. "మధ్యలోనే అడ్డు తగిలింది రాధిక, "ఆ వాదనకి నా దృష్టిలో అసలు విలువేలేదు. .... ఇక, మీ వాదం నాకు చాలా నచ్చింది కూడా. ఇన్నాళ్ళూ, ఇంత మూర్ఖంగా ఆదర్శాలూ - అభ్యుదయాలూ అంటూ అర్థంలేని ఆలోచనలతో ప్రవర్తిస్తున్న నాకళ్ళు యివాళ తెరుచుకున్నాయి. మీ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నా. మీ సలహాలకి థేంక్స్."

కృతజ్ఞతాభావం నిండిన కళ్ళతో చూస్తూ అంది రాధిక.

● ● ●

"ఏం రాధీ! ఇంకా రెడీ కాలేదేం? ఆఫీస్ టైం కావట్లేదూ?... ఇవాళ శెలవుగానీ పెట్టావా ఏమిటి?" టైమ యినా, తయారవ్వని రాధికని చూస్తూ ఆశ్చర్యంగా అన్నాడు రామం.

"అవును. శెలవే పెట్టాను ...పెర్మ నెంటుగా" చిరునవ్వుతో అందిరాధిక.

"ఆ? ! ఏమిటీ! అంటే... రిజైని చ్చావా? మొన్నటి నామాటలకేనా?.... తొందరపడావేమో రాధీ: ... అయినా, నే నూరికే నా అభిప్రాయాలు చెప్పాను గానీ, నిన్ను రిజైనిమ్మ న్నానా?" బాధగా అన్నాడురామం.

"అదేం లేదు. మీ మాటలకోసం నేనేం రాజీనామా యివ్వలేదు. ఇక నుంచీ నా నిర్ణయాలూ, ఆశయాలూ కొన్నిమార్చుకొంటున్నాను.

మీరన్నట్లు, ఎవరో ఒక నిరుపేద నిరుద్యోగికి నాసీటు అప్పగించేస్తున్నా! అయితే, యీ పుణ్యంలో మటుకు మీకు వాటా యివ్వనండోయ్. "నవ్వుతూనే అంది రాధిక.

"సరేలే! ఆ ఉద్యోగం నిరుపేదకి ఉపాధే కానుందో, రికమెండేషన్‌కి బలేఅవుతుందో, ఎవరుచెప్పగలరు?....

సరే, ఆఫీసుకి టయిమయింది. వస్తా- సాయంత్రం నీతో మరో అర్జంటు పనుంది కూడా!" హుషా రుగా బయటకు నడిచాడు రామం,

అంతులేని సంతృప్తితో నడుం చుట్టూ కొంగు దోపుకుని, వంట ఇంటి వైపు నడిచింది, గృహిణిగా మారిన ఉద్యోగినీ, అబలగానే వుండిపోదల్చు కున్న సబలా అయిన రాధిక!

□□□